31న సర్పంచులకు వీడ్కోలు

కోటగిరి, జనవరి 28 : రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31తో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో 31వ తేదీన ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటగిరి మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో ఉదయం 11 గంటలకు సర్పంచులకు సన్మానం, వీడ్కోలు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

డిచ్‌పల్లి సీఐగా మల్లేశ్

డిచ్‌పల్లి, జనవరి 28 : డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మల్లేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన కృష్ణ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిర్మల్ సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న మల్లేశ్ డిచ్‌పల్లికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషిచేస్తానన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి పోలీసులను సంప్రదించాలని సూచించారు. సీఐకి ఎస్సైలు మహేశ్, తిరుపతి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధర్మారం (బీ) గురుకుల విద్యార్థిని

స్వప్నను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి, జనవరి 28 : మండలంలోని ధర్మారం(బీ)లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల విద్యార్థిని స్వప్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం తెలిపారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఔరంగాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో స్వప్న పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్వప్నను ప్రిన్సిపాల్ సంగీతతోపాటు ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, పీఈటీ జ్యోత్స్న, హౌస్ టీచర్ చేన్నకేశ్వరి అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

విరాళం అందజేస్తున్న బొజ్జ సంజీవ్‌గౌడ్

జక్రాన్‌పల్లి, జనవరి 28 : మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఉన్న శిలాతీర్థ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బొజ్జ సంజీవ్‌గౌడ్ రూ.25,116 విరాళంగా అందజేశారు. నగదును ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జైడి అన్వేశ్‌రెడ్డి, లింగారెడ్డి, యోగానందగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లుపీకి పందిరేసి..

- బాల్కొండలో కోతుల బెడద
- బెంబేలెత్తుతున్న గ్రామస్తులు

బాల్కొండ, జనవరి 28: మండల కేంద్రంలో కోతులు బెడద తీవ్రతరమైంది. ఇండ్లు, రోడ్లపై ఎక్కడ చూసినా కోతులే దర్శనమిస్తున్నాయి. బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం హైస్కూల్ గ్రౌండ్‌లో వాకింగ్ చేయాలంటే భయపడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం జడ్పీహెచ్ఎస్ మైదానంలో వాకింగ్ కోసం వస్తున్న, వెళ్తున్న వారిపై వానరాలు దాడులకు దిగుతున్నాయి. దీంతో కొందరు గ్రౌండ్‌కు రావడానికి జంకుతున్నారు. అలాగే ప్రభుత్వ దవాఖానలో వైద్యం కోసం వచ్చే రోగులు సైతం రావడానికి భయపడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. హైస్కూల్ గ్రౌండ్, దవాఖాన ఆవరణ, ఇండ్లలోకి ప్రవేశించి సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. ఇంట్లో పండ్లు, కూరగాయలు ఎత్తుకెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వానరాల భయంతో రోజంతా ప్రజలు తమ ఇండ్ల తలుపులను వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడైనా బైకులు నిలిపితే చాలు వాటి సీట్ కవర్లు, ట్యాంకు కవర్లను చించి పడేస్తున్నాయి. దవాఖానలో ఉన్న రోగులకు కవర్లలో ఏవైనా తినుబండారాలు తీసుకెళ్తే దవాఖాన గేటు వద్దనే లాక్కెళ్తున్నాయని రోగుల బంధువులు వాపోతున్నారు. గతంలో గ్రౌండ్ దగ్గర ఉన్న గ్రంథాలయంలోకి కోతులు వెళ్లి పుస్తకాలను చిందరవందరగా చేశాయి.ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడద నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

బాల్కొండలో కోతుల బెడద చాలా ఉన్నది. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవం. ప్రతిరోజూ వాకింగ్ చేయడానికి హైస్కూల్ గ్రౌండ్‌కు వస్తున్న వారిని కోతులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. త్వరలో పైఅధికారులకు విషయం తెలియజేసి, కోతుల సమస్యను పరిష్కరిస్తాం.

- రజనీకాంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, బాల్కొండ

ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

మోపాల్ (ఖలీల్‌వాడి), జనవరి 28 : మండలంలోని కంజర గ్రామంలో ఉన్న మహాలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మోటాడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పువాయిద్యాల నడుమ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఒడిబియ్యం పోసి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుడి ప్రవీణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అర్కల నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, జగత్‌రెడ్డి, కేశ్‌పల్లి గంగారెడ్డి, అంగల్ ఉదయ్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గదుల నిర్మాణానికి దాతల సహకారం

విరాళం అందజేస్తున్న దాతలు

మాక్లూర్, జనవరి28: అమ్రాద్ గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఆలయం, శ్రీఆంజనేయస్వామి ఆలయాల సమీపంలో గదుల నిర్మాణానికి గ్రామానికి చెందిన దాతలు ఆదివారం విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తోట రాజన్న తెలిపారు. గ్రామానికి చెందిన జువ్వాజీ ధన్‌కాంత్ రూ.51వేలు, కూరపాటి రమేశ్ రూ.25వేలు అందజేశారని చెప్పారు.

భూపతిరెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలి

డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె భూమన్న

డిచ్‌పల్లి, జనవరి 28 : రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి చిల్లర రాజకీయాలు మానుకొని, హుందాగా వ్యవహరించాలని డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమయ్య అన్నారు. మండలకేంద్రంలోని తన నివాసంలో ఆదివారం విలేకరులతో ఎంపీపీ మాట్లాడారు. అధికారంలో ఉన్న బీసీ వర్గాల నాయకులను అణగదొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అవిశ్వాసాలను ప్రోత్సహిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న ఎంపీటీసీలు కొందరు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి, ఈ నెల 12న తనపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చారని తెలిపారు. ఇందులో భాగంగానే ఈనెల 29న అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తాను ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా, సమావేశాన్ని నిర్వహించరాదని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని వెల్లడించారు. తాను అవినీతికి పాల్పడినట్లు నడిపల్లి-2 ఎంపీటీసీ నర్సయ్య తనపై అవిశ్వాస నోటీసు అందజేయడంతోపాటు తాను ముందస్తు స్టే ఆర్డర్ తెచ్చుకోవద్దని మూడు కోర్టుల్లో కేవియట్ దాఖలు చేశారని వివరించారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. హైకోర్టు తనకు స్టే ఆర్డర్ మంజూరు చేసిందని చెప్పారు. ఆర్డీవోకు నోటీసులు ఇచ్చే అధికారం లేకున్నా అవిశ్వాస సమావేశంపై ఎంపీటీసీలకు నోటీసులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లపై అవిశ్వాస తీర్మానాలను ప్రోత్సహించడం మానుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ ఎంబడి సంతోషం, నాయకులు పానుగంటి సంతోష్, చౌకి లక్ష్మణ్, ప్రతాప్, బాలయ్య, చరణ్, విష్ణు, వినోద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఖరి నశించాలి

దీక్ష నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్, జనవరి28: ముస్లింలను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ వైఖరి నశించాలని, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా ఇన్‌చార్జి చైర్మన్‌గా ప్రకటించాలని కోరుతూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్, ముస్లిం నాయకులు ఆదివారం నిరాహార దీక్ష నిర్వహించారు. ముస్లిం నాయకులు మాట్లాడుతూ తప్పుడు రిపోర్టులు సృష్టిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి28: ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మోటురి మురళి అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో వైశ్య సంఘం జిల్లా సర్వసభ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోల సుధాకర్, జిల్లా కార్యదర్శి పురుషోత్తమ్, తమ్మి శీను, గజవాడ మౌనిక, పోల మధుకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గది తాళం ధ్వంసం

వినాయక్‌నగర్, జనవరి 28 : నిజామాబాద్ రూరల్ పరిధిలోని గుండారం జడ్పీహెచ్ఎస్‌లో ప్రిన్సిపాల్ గది తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు సమాచారం మేరకు రూరల్ పోలీసులు వెళ్లి పరిశీలించారు. పాఠశాలలోని సామగ్రి చోరీకి గురి కాలేదని గుర్తించారు. ఇది పోకిరీల పని అయి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

- ఏర్గట్ల, జనవరి 28: మండలంలో ఇంటి పన్నుల వసూలు ముమ్మరం చేయాలని ఎంపీవో శివచరణ్ గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.
- మాక్లూర్, జనవరి28: మానిక్‌బండార్ గ్రామ అభివృద్ధి కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంపత్ వినోద్, ఉపాధ్యక్షుడిగా అర్జున్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా నర్సయోల్ల లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడిగా రాయిసింగ్, సంయుక్త కార్యాదర్శిగా రాస అరుణ్, కోశాధికారిగా దమ్మాయి అనిల్ ఎన్నికయ్యారు.
- నందిపేట్, జనవరి 28 : ఖుద్వాన్‌పూర్ గ్రామ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మ సందీప్, కోశాధికారిగా మంగ్లారపు తుక్కన్న, రైటర్‌గా మెట్టు గంగాధర్, వైస్‌చైర్మన్‌గా శేడొళ్ల చెర్లన్న, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వారికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.
- బోధన్ రూరల్, జనవరి 28: మండలంలోని సంగం గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ కల్లురి అంజవ్వా గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు. అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.
- శక్కర్‌నగర్, జనవరి 28: బోధన్ పట్టణం రాకానీపేట్‌లోని భీమునిగుట్ట వద్ద ఉన్న సయ్యద్ షా జమాల్ ఖాద్రీ దర్గాలో ఉర్సు రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి స్థానిక ముత్తావలి ఇంటి నుంచి ఛాదర్‌ను ఊరేగింపుగా తీసుకుని వచ్చి అర్ధరాత్రి దాటాక దర్గాపై అలంకరించారు.

దోమల నివారణకు ఫాగింగ్

మోర్తాడ్‌లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మోర్తాడ్, జనవరి28: మండల కేంద్రంలో దోమల నివారణకు రెండురోజులుగా ఫాగింగ్ చేస్తున్నారు. జీపీ వాహనంలో ఫాగింగ్ మిషన్‌ను ఉంచి గ్రామంలోని ప్రతి వీధిలో ఫాగింగ్ చేస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు సహకారాన్ని అందించాలని సర్పంచ్ బోగ ధరణి కోరారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

గెలుపొందిన క్రీడాకారులు

కమ్మర్‌పల్లి, జనవరి 28: మండల కేంద్రంలోని కేబీఏ ఇండోర్ స్టేడియంలో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ హాజరై మాట్లాడారు. మండల కేంద్రంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన కేబీఏను అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఓపెన్ డబుల్స్ విభాగంలో రాఘవ అండ్ అర్షద్ (ప్రథమ) నిజామాబాద్, పెంట కిషన్ అండ్ మోహన్‌రెడ్డి (ద్వితీయ), కేబీఏ కమ్మర్‌పల్లి నవీన్ అండ్ విష్ణు (తృతీయ), బైంసా 40+డబుల్స్ విభాగంలో పెంట కిషన్ అండ్ మోహన్ రెడ్డి (ప్రథమ), కేబీఏ కమ్మర్‌పల్లి డాక్టర్ నవీన్ అండ్ సాయి(ద్వితీయ), హైదరాబాద్ దినేశ్ అండ్ నవీన్(ముప్కాల్) తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో కేబీఏ అధ్యక్షుడు ఎండీ.అహ్మద్, సలహాదారులు బక్క గంగాధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకెట రవి, తిప్పిరెడ్డి శ్రీనివాస్, కేబీఏ సభ్యులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

సర్పంచ్‌ను సన్మానించిన మాల సంఘం సభ్యులు

మాక్లూర్, జనవరి28: పదవులు శాశ్వతం కాదని, చేసిన పనులు శాశ్వతంగా ఉంటాయని, వాటితోనే పేరు ప్రఖ్యాతలు వస్తాయని ఎంపీపీ మాస్త ప్రభాకర్ అన్నారు. అడవిమామిడిపల్లి సర్పంచ్ చింత మల్లారెడ్డి పదవీ కాలం ఈ నెలతో ముగియనుండడంతో గ్రామానికి చెందిన మాల సంఘం సభ్యులు ఆయనను ఆదివారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లాడారు. గత ఐదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యధికంగా నిధులు మంజూరు కావడంతో గ్రామాన్ని అని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవి, లింగన్న, సాగర్, రాజేశ్వర్, కర్రన్న, ఎర్రన్న గంగారాం, రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బాగేపల్లి జీపీ పాలకవర్గానికి..

రెంజల్, జనవరి 28: మండలంలోని బాగేపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గానికి జీపీ కార్యదర్శి శ్రీకాంత్ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ పాముల సాయిలు, ఉప సర్పంచ్ సుదర్శన్, వార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

సన్మానం పొందిన బాగేపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం

కుల బహిష్కరణ ఫిర్యాదు.. 24 మందిపై కేసు

వినాయక్‌నగర్, జనవరి 28 : నిజామాబాద్ మండలపరిధిలోని బోర్గాం(పీ)గ్రామంలో మోటాడిరెడ్డి కులస్తులు తనను కుల బహిష్కరణ చేశారని ఓ కుల సభ్యుడు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. 24 మంది కులస్తులపై కేసు నమోదు చేసినట్లు నగర సీఐ నరహరి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బోర్గాం(పీ) గ్రామానికి చెందిన ఈగ నారాయణరెడ్డికి ఇద్దరు కుమారులు ఈగ గంగారెడ్డి, ఈగ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఈగ నారాయణ రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో తన దవాఖాన ఖర్చులతోపాటు మంచి, చెడును చూసేలా తన కుమారులకు చెప్పాలని మోటాడిరెడ్డి కమిటీ సభ్యులను ఆశ్రయించాడు. దీంతో ఇద్దరు కుమారులను పిలిపించి వారి తండ్రి మంచి, చెడుల కోసం ఒక్కొకరు రూ.5 లక్షలు ఆయనకు ఇవ్వాలని కమిటీ సభ్యులు సూచించారు. చిన్న కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి తన వంతుగా రూ.5 లక్షలు ఇచ్చాడు. పెద్ద కుమారుడు గంగారెడ్డి డబ్బులు ఇవ్వకపోవడంతో కమిటీ సభ్యులు ప్రశ్నించారు. తనకు పంచి ఇచ్చిన ఆస్తిని విక్రయించుకునేందుకు తన తండ్రి అనుమతి పత్రం రాసి ఇస్తేనే డబ్బులు ఇస్తానని గంగారెడ్డి కమిటీ సభ్యులకు చెప్పాడు. తమ మాట వినలేదని కమిటీ సభ్యులు కుల బహిష్కరణ చేశారని గంగారెడ్డి నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో మోటాడిరెడ్డి కుల కమిటీకి చెందిన 24 మందిపై ఎస్సై సంజీవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ దవాఖానలో చోరీ

వినాయక్‌నగర్, జనవరి 28 : జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానలోకి ఓ దుండగుడు హ్యాండ్‌బ్యాగ్‌ను చోరీ చేశాడు. దవాఖాన సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖలీల్‌వాడిలోని ఓ మల్టీ సూపర్ స్పెషలిటీ దవాఖానలోకి శుక్రవారం రోజు ఓ దుండగుడు ప్రవేశించాడు. దవాఖాన సిబ్బంది ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్న సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో దవాఖాన సిబ్బందికి సంబంధించిన ఓ హ్యాండ్ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లాడు. సాయంత్రం తన బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితురాలు సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఓ దుండగుడు తన బ్యాగ్‌ను ఎత్తుకెళ్లిన దృశ్యాలు రికార్డయ్యాయి. బ్యాగులో సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,200 నగదు, వెండి పట్టగొలుసులు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. దవాఖాన సిబ్బంది బాధితురాలి సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా.. చోరీ చేసిన వ్యక్తి మాట్లాడుతూ.. తనను ఎవరూ ఏమీ చేయలేరని, దమ్ముంటే తనను పట్టుకోవాలని సవాలు విసిరాడని సమాచారం. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం



ఎల్లబెల్లి శ్రీయ

వినాయక్‌నగర్, జనవరి 28 : నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన యువతి ఎల్లబెల్లి శ్రీయ (20) కనిపించడం లేదని ఆమె తల్లి ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. శ్రీయ ఈనెల 26వ తేదీన నగరంలోని కంఠేశ్వర్ ఏరియాలో ఉన్న శ్రావ్యగార్డెన్స్‌లో ప్రోగ్రామ్ ఉందని ఉదయం 9.30 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయంత్రమైనా ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని, ఆమె స్నేహితులకు ఫోన్‌చేస్తే అక్కడి నుంచి బయల్దేరిందని చెప్పారని తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సూర్యనగర్‌కు చెందిన యువకుడు..

వినయ్

వినాయక్‌నగర్, జనవరి 28 : నగరంలోని సూర్యనగర్‌కు చెందిన వినయ్ అదృశ్యమైనట్లు ఆయన భార్య ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్, తెడ్డు ప్రతిభ రెండేండ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. నగరంలోని ఓ దవాఖానలో వినయ్ పనిచేస్తున్నాడు. ఈనెల 25న డ్యూటీకి వెళ్లిన వినయ్ తిరిగి ఇంటికి రాలేదని, ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఫొటోల ఆధారంగా ఆచూకీ తెలిసిన వారు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్-08462 234750 లేదా ఎస్సై-87126 59840 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గుండెపోటుతో ఆర్టీసీడ్రైవర్ మృతి

గోవింద్ (ఫైల్)

రుద్రూర్, జనవరి 28 : మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బొడికె గోవింద్ (54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన అనంతరం.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని కుటుంబీకులకు తెలుపగా.. దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుతో మృతిచెందాడు. అంత్యక్రియలకు ఆర్టీసీ బోధన్ డీఎం శ్రీనివాస్ హాజరై నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 20 వేలు కుటుంబీలకు అందజేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రన్నింగ్‌రేస్‌లో వేల్పూర్ వాసికి మెడల్

మెడల్ సాధించిన గుగ్లిల్ అశోక్

వేల్పూర్, జనవరి 28: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రన్నింగ్ పోటీలో మండల కేంద్రానికి చెందిన గుగ్లిల్ అశోక్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు వద్ద 10 కిలోమీటర్లు రన్నింగ్ రేస్‌లో బహుమతి సాధించినట్లు అశోక్ తెలిపారు. మెడల్ సాధించిన అశోక్‌ను గ్రామస్తులు అభినందించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్, జనవరి28: నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో ఆదివారం రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ బుశిరెడ్డి శంకర్‌రెడ్డి క్లబ్ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలకు కుర్చీలు, టేబుల్స్ వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు గోపికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

రెంజల్ మండలంలోని కందకుర్తి శివారులో ఉన్న త్రివేణి సంగమ క్షేత్రానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి పురాతన శివాలయంలో పూజలు నిర్వహించారు. - రెంజల్, జనవరి 28

విద్యార్థులతో మారయ్యగౌడ్

కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

నవీపేట, జనవరి 28: భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్య గౌడ్ సూచించారు. మండలంలోని జన్నెపల్లి ఎస్ఎస్ఆర్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅథితిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు, పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సీఈవో హరితగౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి

బోధన్, జనవరి 28: రాష్ట్రంలో వివిధ కార్యాలయాలు, బయట హమాలీ పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని తెలంగాణ హమాలీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌ల